

పండుగలు ప్రశాంతంగా
జరుపుకోవాలి

● బళ్లారి రోడ్‌మార్చ్‌లో ఎస్పీ శోభారాణి

8





ప్రసంగిస్తున్న సీఎం సిద్ధరామయ్య

దశాబ్దాల పోరాటానికి దక్కిన న్యాయం

● వర్గీకరణతో మాల, మాదిగలకు చెరో 6 శాతం రిజర్వేషన్లు
● అస్పృశ్యవర్గాలకు 5శాతం
● నాగమోహన్‌దాస్ కమిషన్ నివేదికకు కేబినెట్ ఆమోదం
● శాసనసభలో సీఎం
● నివేదిక అశాస్త్రీయం
● ఉప కులాలకు అన్యాయం
● పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా ఎస్సీ వర్గీకరణ కోసం సాగుతున్న పోరాటానికి సమగ్ర న్యాయం లభించిందని మాదిగ అనుబంధ సామాజిక వర్గాలకు 6శాతం, మాల అనుబంధ సామాజికవర్గాలకు 6శాతం, అస్పృశ్య వర్గాలకు 5శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేశామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. బుధవారం శాసనసభలో ప్రసంగిస్తూ వర్గీకరణ ద్వారా అంతర్గత రిజర్వేషన్లు కల్పించేలా సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1న సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో అమలు చేశామన్నారు. 2024 నవంబరు 12న మాజీ న్యాయమూర్తి నాగమోహన్‌దాస్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. కమిషన్ రాష్ట్రంలోని 101 ఎస్సీ కులాలకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేసి ఈనెల 1న నివేదికను సమర్పించారన్నారు. ఎస్సీ కులాలకు చెందిన 1,05,09,871 మంది ప్రజలనుంచి వివరాలు సేకరించారన్నారు. 93శాతం ఎస్సీ కులాల జనాభాలో సమీక్షకు అందుబాటులోకి వచ్చారన్నారు. నాగమోహన్‌దాస్ కమిషన్ సిఫారసులలో కొంత మార్పులు చేసి మంగళవారం మంత్రివర్గ సమావేశంలో నివేదికను అంగీకరించామన్నారు. పరయ, మొగెరె వంటి మాల సామాజికవర్గాలను మాదిగ సామాజికవర్గంలోకి మార్పు చేసిన అంశాన్ని గుర్తించామన్నారు. తిరిగి ఆ రెండు ఉపకులాలను మాల సామాజికవర్గంలోకి చేర్చామన్నారు. ఆది కర్ణాటక, ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ పేరిట ఉండే 4,74,954 మందిని మాల, మాదిగ అనుబంధ కులాలకు సమానంగా చేర్చామన్నారు. అస్పృశ్య కులాలకు 4శాతం రిజర్వేషన్‌ను కమిషన్ సిఫారసు చేసిందన్నారు. 59 ఉపకులాలకు చెందిన 5,22,099మంది ఏ కేటగిరీగా కమిషన్ తీర్మానించిందన్నారు. సాంకేతిక కారణాలతో రెండింటినీ కలిపి 5శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానించామన్నారు. కమిషన్ ఏ, బీ, సీ, డీ, ఈ కేటగిరీగా విభజించాలని సిఫారసు చేసిందని, కానీ మంత్రివర్గం ఏ, బీ, సీ గా మాత్రమే నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏ కేటగిరీలోని మాల సామాజికవర్గానికి 6శాతం, బీ కేటగిరీలోని మాదిగ సామాజికవర్గాలకు 6శాతం, సీ కేటగిరీలోని అస్పృశ్య కులాలకు 5శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానించామన్నారు. ఎస్సీ సామాజికవర్గంలోని 101 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఇతర అవకాశాలు కల్పించడంలో సమానత్వం, న్యాయసమ్మతంగా ఉండేలా మార్పులు చేశామన్నారు. ఎస్సీ కులాలలో ప్రగతిని, లభ్యమయ్యే గణాంకాలను పరిశీలించి కాలానికి అనుగుణంగా అధ్యయనం చేసి శాశ్వత ఎస్సీ జాతుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఆదేశాలు జారీ చేసిన వెంటనే నియామకపు ప్రక్రియను ప్రారంభించాలని, ఒకసారికి వయో పరిమితిని సడలించాలని తీర్మానించామన్నారు. వర్గీకరణ పోరాటానికి సంబంధించిన కేసులను ఉపసంహరించుకోవాలని తీర్మానించామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంలో మార్పులు చేయదలచుకుంటే భవిష్యత్తులో జాతీయ కులగణన గణాంకాల ఆధారంగా మార్పులకు షరతులతో అంగీకరిస్తామన్నారు. నాగమోహన్‌దాస్ కమిషన్‌పై ప్రస్తావించిన మార్పులతో అంగీకరించిన అంశాలను శాసనసభ ముందు ఉంచేందుకు ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు దశాబ్దాలకాల పోరాటానికి న్యాయం లభించిందని భావిస్తున్నామన్నారు.





సభలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత అశోక్, మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్

ప్రజాధనం వృథా: చలవాది



ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేయాలని ఏర్పాటు చేసిన జస్టిస్ హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ కమిషన్ నివేదిక అశాస్త్రీయమని పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మండిపడ్డారు. కమిషన్ నివేదికకు అనుగుణంగా పరిషత్‌లో చలవాది మాట్లాడుతూ కమిషన్‌లో ఏ, బీ, సీ, డీ, ఈ అనే కేటగిరీలో విభజించారని, ఆది కర్ణాటక, ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ అనే కులాలు లేకున్నా వాటిని పరిగణించారన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను బసవరాజ్ బొమ్మై ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 15నుంచి 17శాతానికి పెంచారన్నారు. ఎస్సీలను 4 గ్రూపులుగా విభజించారన్నారు. మాదిగకు 6శాతం, మాలలకు 5.5శాతం, అస్పృశ్యులకు 4.5శాతం, ఇతరులకు ఒక శాతం కేటాయించారన్నారు. కమిషన్ నివేదికకోసం కోట్ల రూపాయలు ప్రజాధనం వృథా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించారని, రెండేళ్లు పట్టిందన్నారు. హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు చేశారన్నారు. ప్రయోగాత్మకంగా గణాంకాలను సేకరించలేదన్నారు. పలువురు ఎస్సీలను సమీక్షకు దూరంగా ఉంచారన్నారు.



రాజీవ్‌గాంధీ, దేవరాజ్ అరసు చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

గ్యారెంటీ పథకాలతో పేదల ఖాతాల్లోకి
రూ.లక్ష కోట్లు

● దేవరాజు అరసు జయంతి వేడుకల్లో డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలతో లక్ష కోట్ల రూపాయలు అందించిందని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. బుధవారం కేపీసీసీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ సీఎం దేవరాజ్ అరసు జయంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రెండేళ్లలో గ్యారెంటీల ద్వారా లక్ష కోట్ల దాకా సామాన్య, మధ్య తరగతి ప్రజల ఖాతాల్లో వేశామన్నారు. దేశంలో చారిత్రాత్మక మార్పులకు రాజీవ్‌గాంధీ కారకులన్నారు. బెంగళూరులో తాను చదువుతున్నప్పుడు జనరల్ హాస్టల్‌లో ఉండేవాడినని, అప్పట్లో ఫోన్ లేదని, ఫోన్ కావాలంటే నాలుగైదేళ్లు పట్టేదన్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరు 2-3 ఫోన్లను అందుబాటులోకి తెచ్చుకున్నారన్నారు. సామాన్యులకు సైతం సాంకేతికత అందేలా చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కల్లే శివోత్తమ రావుకు అరసు పురస్కారం

7

పురస్కారంతో సత్కరిస్తున్న సీఎం సిద్ధరామయ్య



26 క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ఉప్పొంగుతున్న తుంగభద్ర

● 26 క్రస్ట్‌గేట్ల నుంచి 1.28 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు..
● నీటమునిగిన హంపి, ఆనెగొంది చారిత్రక చట్టడాలు
● జలమయమైన లోతట్టు ప్రాంతాలు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. నదీ తీర ప్రాంతాలు, పంటపొలాలు జలమయం అవుతున్నాయి. నీటి ప్రవాహం రోజు రోజుకూ పెరుగుతున్న కారణంగా గత కొన్ని రోజులుగా తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ బళ్ళారి, కొప్పళ జిల్లాల జిల్లాధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో తుంగభద్ర నది ప్రవహించి విజయనగర జిల్లా పరిధిలోని చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపి, కొప్పళ జిల్లా పరిధిలోని ఆనెగొంది, సణాపురం ప్రాంతాల్లో తుంగభద్రనది (మిగతా 8వ పేజీలో)



వరద నీటిలో మునిగిపోయిన కృష్ణదేవరాయల సమాధి

డిజిటల్ విప్లవకారుడు రాజీవ్‌గాంధీ

8

● జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

అడుసు తొక్కితేనే అక్షరాలు..!

● బడికెళ్లాలంటే బురదలో నడవాల్సిందే
● ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని అధికారులు

రాయచూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని పంచముఖి గణదాళ లింక్ రోడ్డు అధ్వానంగా మారింది. దాదాపు దశాబ్దానికి పైగా ఈ మార్గంలో బీటీ రోడ్డు కనుమరుగైంది. 11 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా దాన్ని స్థానంలో అప్పుడప్పుడు వేసిన మట్టితో రోడ్డంతా బురదమయంగా మారింది. ఇటీవల కురుస్తున్న జోరు వానలకు రోడ్డంతా వర్షపు నీరు ఆగి బురదమయం కావడంతో ఈ మార్గంలో వెళ్లే వారు నానా అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా కనీసం స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం బురదతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా పాలకులు స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.



బురదలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

హిందీ టీచర్ పోస్టులు హుళక్కే..!





● ద్విభాషాసూత్రం అమలుకు పెరుగుతున్న ఒత్తిడి
● అయోమయంలో 27వేల మంది ఉపాధ్యాయులు

బెంగళూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టు.... రాష్ట్రంలో కొన్నేళ్లుగా అమలులో ఉన్న త్రిభాషాసూత్రానికి స్వస్తి పలికి ద్విభాషా విధానం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో హిందీ టీచర్ల భవిష్యత్తు అయోమయం కానుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో త్రిభాషా సూత్రం కొనసాగుతోంది. మాతృభాష కన్నడతోపాటు ఇంగ్లీష్, మూడోభాషగా హిందీని చదువుతున్నారు. రాష్ట్రంలో ద్విభాషా సూత్రం అమలు చేయాలని కన్నడ సంఘాలు కొన్నేళ్లకాలంగా పోరాటం చేస్తున్నాయి. హిందీని అనవసరంగా రుద్దరాదని, అది ఒక భాష మాత్రమేనని, జాతీయభాష కాదని కన్నడసంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. హిందీ ప్రభావం పెరుగుతోందని కన్నడ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. ఇందులో భాగంగానే బెంగళూరు, బెళగావి ప్రాంతాలలో హిందీ, మరాఠీ బోర్డులు పెట్టి వ్యాపారాలు చేయడాన్ని కన్నడ సంఘాలు అభ్యంతరం తెలుపుతున్నాయి. సుదీర్ఘ పోరాటాలు, దాడులు కొనసాగాయి. ఇతర ఏ భాషలలో బోర్డులు ఉన్నా కన్నడ కూడా తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశాయి.

ఎన్ఈపీ అమలుకు సిద్ధం

కేంద్రప్రభుత్వం జాతీయ విద్యావిధానం పాలసీ (ఎన్ఈపీ)ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. అప్పట్లో రాష్ట్రంలో బీజేపీ పాలన ఉండడంతో తొలుత ఎన్ఈపీని అమలులోకి తీసుకొచ్చారు. జాతీయ విద్యావిధానం ఉండడం ద్వారా హిందీ భాషకు ఢోకాలేదని భాషాభిమానులు, భాషా పండితులు భావించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని రద్దు చేసింది. అందుకు ప్రత్యామ్నాయంగా స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చారు. ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో త్రిభాషాసూత్రానికి స్వస్తి పలికి ద్విభాషా పాలసీని అమలు చేయాలని విద్యానీతి కమిషన్ ప్రస్తావన వల్ల రాష్ట్రంలోని హిందీ ఉపాధ్యాయులలో వణుకు పట్టుకుంది. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి హిందీ బోధనలు అవసరం లేదని, మీరు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని హిందీ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ విధానాన్ని హిందీ ఉపాధ్యాయుల సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో ఆరో తరగతి నుంచి తృతీయభాషగా హిందీని నేర్పుతారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6,500మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 8,400, ప్రైవేట్ పాఠశాలల్లో 10,600మంది, గెస్ట్ ఉపాధ్యాయులు వెయ్యి మందికిపైగా ఉన్నారు.

భవిష్యత్తు ప్రశ్నార్థకం

1,200మంది హిందీ అధ్యాపకులు ఉన్నారు. అయితే హిందీలో బీఈడీ చేసి ఉపాధ్యాయులు కావాలనుకుంటున్నవారు 6,800మంది రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారు. ద్విభాషాసూత్రం అమలులోకి వస్తే 40వేలమంది భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. హిందీభాష పట్ల ఎక్కువమందికి అభిమానం ఉందని, మాతృభాషతోపాటు ఇంగ్లిష్‌ను అకడమిక్ రూపంలో నేర్చుకుంటారని, కానీ హిందీ నేర్చుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అయినా జీవనం చేసేందుకు వీలుందని, పైగా దేశంలో ఎక్కువ రాష్ట్రాల్లో భాష ఉన్నందున అమలు చేస్తున్నారు. హిందీలో ఇతర సబ్జెక్టుల మాదిరిగా కాకుండా నామమాత్రపు మార్కులతో ఉత్తీర్ణులయ్యే వెసలుబాటు ఉంది. 2024-25లో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలలో అన్ని సబ్జెక్టులకంటే ఎక్కువమంది ఉత్తీర్ణత సాధించారని, పైగా 17,909మంది హిందీలో వందశాతం మార్కులు సాధించారు. కన్నడతో సమానంగానే విద్యార్థులు హిందీలోనూ ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో ప్రథమభాషలో 77.37శాతం ఉత్తీర్ణత సాధించగా, హిందీలో 76.69శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయభాషలో 75.4శాతం ఉత్తీర్ణత సాధించారు. హిందీలో విద్యార్థులు ఎక్కువమంది ఫెయిల్ అవుతున్నారనేది అవాస్తవమని గణాంకాలు రుజువు చేస్తున్నాయి. రాష్ట్రంలో హిందీ భాషను ఆరో తరగతి నుంచి నేర్పిస్తారు. 6 నుంచి 8వ తరగతి వరకు హిందీ ఉపాధ్యాయుల కొరత ఉంది. హిందీ ఉపాధ్యాయుల నియామకాలు జరగడం లేదు. మంజూరైన పోస్టుల్లో సగానికిపైగా ఖాళీగా ఉన్నాయి. పలు పాఠశాలల్లో ఇతర సబ్జెక్టులు బోధించేవారే హిందీని కూడా నేర్పుతున్నారు. మరోవైపు హిందీ ఉపాధ్యాయులు టీచర్ల కొరత కారణంగా ఇతరభాషలు కూడా బోధిస్తున్న విధానం ఉంది. అయినా హిందీలో ఎక్కువమంది ఉత్తీర్ణులు అవుతున్నారు. ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయులకు సహా వచ్చే ఏడాది నుంచి భవిష్యత్తు ఏం కానుందనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదే విషయమై తోటి ఉపాధ్యాయుల వద్ద అప్పుడే చర్చలు ప్రారంభమయ్యాయి. హిందీ ఉపాధ్యాయులు భాషను బోధించేందుకు నియమించుకున్నారు. ద్విభాషా సూత్రం అమలు చేస్తే ప్రభుత్వ ఉపాధ్యాయులు భవిష్యత్తులో ఏం చేయాలనేది ప్రశ్నార్థకం అవుతుంది. ప్రైవేట్ పాఠశాలల్లో అయితే ముందుగానే హిందీ టీచర్లకు ఉద్యోగం వదులుకోవాలని సూచిస్తున్నారు. హిందీ ప్రచార సమితి ఏటా భాషాభివృద్ధిలో భాగంగా ప్రత్యేక కోర్సులను కొనసాగిస్తోంది. భాషపట్ల ఆసక్తి కలిగినవారు వయస్సుతో నిమిత్తం లేకుండా హిందీలో ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష వంటి కోర్సులు చేస్తున్నారు.



పోరాటానికి సిద్ధమవుతున్న ఉపాధ్యాయులు

మా అందరి మాతృభాష కన్నడయే అని అయితే వృత్తిపరంగా హిందీ నేర్చుకుని బోధిస్తున్నామని వారంటున్నారు. ప్రభుత్వం ద్విభాషా సూత్రాన్ని అమలులోకి తీసుకొస్తే 40వేలమంది ఒక్కసారిగా వీధినపడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. జాతీయ ఐక్యతా దృష్ట్యా ఎక్కువభాషలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో 1961లో త్రిభాషాసూత్రాన్ని అమలులోకి తెచ్చారు. ఆరు దశాబ్దాలపాటు అమలులో ఉన్న విధానాన్ని శాస్త్రీయ అధ్యయనాలు జరపకుండానే ఉన్నఫళంగా ఎస్ఈపీ ఏ విధంగా సిఫారసు చేసిందని ప్రశ్నించారు. హిందీ భాషను రద్దు చేయరాదనే డిమాండ్‌తో హిందీ ఉపాధ్యాయుల సంఘం సిద్ధమైంది. ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపే పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రధానమంత్రికి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, కాంగ్రెస్ కీలకనేత రాహుల్‌గాంధీకి మెయిల్ ద్వారా రాష్ట్రంలో తృతీయభాషను కొనసాగించేలా డిమాండ్ చేస్తున్నట్లు హిందీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శశిధర్ తెలిపారు.

ఆదర్శంగా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్

● ఎమ్మెల్యే పరిటాల సునీత ● కందుకూరు ఎంఐజీ లేఅవుట్‌లో మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని ఎంఐజీ లేఔట్‌లో మౌలిక వసతుల పనులకు అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. అహుడా, పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో రూ.40కోట్ల అంచనాతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొన్న వారికి అద్భుత సౌకర్యాలు ఉంటాయన్నారు. మధ్యతరగతి వర్గాలకు అధునాతన సౌకర్యాలతో కూడిన ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అహుడా ఆధ్వర్యంలో నిర్మాణాలు వేగంగా సాగుతాయన్నారు. ప్రతి ప్లాట్‌కు విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తవ్వకాల్లో చరిత్ర

● మట్టిలో కలిసిపోతున్న పురాతన శిల్పసంపద
● గుప్తనిధుల కోసం ఆలయం అంతా పెకలింపు
● అధ్వానస్థితిలో పంచలింగాల ఆలయం



శిథిలావస్థకు చేరిన పంచలింగాల దేవాలయం



ఆలయ వైభవాన్ని తెలుపుతున్న శిలాశాసనం

కళ్యాణదుర్గం/కుందుర్పి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొందరు స్వార్థపరులు చరిత్రను మట్టిలో కలిపేస్తున్నారు. దురాశతో పురాతన సంపద కోసం ఆలయాలను తవ్వేస్తున్నారు. దీంతో శతాబ్దాల చరిత్ర కలిగిన శిల్పాలు, ఘన చరిత్రకు ఆనవాలుగా మిగిలిన ఆలయాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఇందుకు కుందుర్పి మండలం మలయనూరు గ్రామంలోని పంచలింగాల ఆలయమే ఉదాహరణ. ఈ ఆలయాన్ని క్రీ.శ.1179వ సంవత్సరంలో పశ్చిమ చాళుక్యులు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ ఒకే ప్రాంగణంలో మల్లికార్జున దేవాలయం, లక్ష్మణేశ్వర దేవాలయం, చిరుగోళ్లేశ్వర దేవాలయం, మహేశ్వర దేవాలయం, సూర్య దేవర ఆలయం ఉన్నాయి. వీటిని ఒక్కరోజులోనే నిర్మించి, అందులో దేవతా మూర్తులను ప్రతిష్ఠించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ దేవాలయాలు పూర్తిగా పాడుబడిపోయాయి. కొందరు దుండగులు గుప్త నిధుల కోసం ఆలయాలను తవ్వేశారు. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదుపై 2024, 2025లో రెండు కేసులు నమోదయ్యాయి. గుప్తనిధుల తవ్వకాలపై 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.



ఆలయం లోపల పెకలించిన దృశ్యం

గుప్తనిధుల ఆశతో ఆలయం ధ్వంసం

ఈ పంచలింగాల ఆలయంలో భారీగా గుప్తనిధుల ఉన్నాయన్న ఆశతో కొందరు దుండగులు రహస్యంగా ఆలయాన్ని అంతా ధ్వంసం చేశారు. లోపల ఉన్న నంది విగ్రహం, శివలింగాన్ని పూర్తిగా పగలకొట్టేశారు. ఆలయంలో ఎంతో ఘనత కలిగిన శిల్ప సంపద ఉన్నప్పటికీ గుప్తనిధుల తవ్వకాలతో ఆలయ వైభవం మరుగున పడిపోయింది. ఆలయంలో కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ ఆలయ విషయాన్ని పలుమార్లు పురావస్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం, కర్నూలు పురావస్తుశాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ రజిత ఈ ఆలయాన్ని పలుమార్లు సందర్శించినప్పటికీ అభివృద్ధిపై ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో ఆలయం అంతా అధ్వానస్థితికి చేరుకుంది. దీంతో ఇది పేకాట, మందు బాబులకు నిలయంగా మారింది.

కాపాడుకుందాం



కుందుర్పి మండలంలోని మలయనూరులో ఐదు లింగాల దేవాలయంలో ఉన్న శిల్ప సంపద పూర్తిగా అంతరించిపోయింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ దేవాలయం నేడు పూర్తిగా కనుమరుగయ్యే దుస్థితిలో ఉంది. పురావస్తు శాఖ అధికారులు ఈ ఆలయం బాగోగులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మాన దేశ ఘనతను చాటే ఇలాంటి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

-నరసింహులు, గురివేపల్లి, కుందుర్పి మండలం

శిల్ప కళా సంపదకు మారుపేరు



మా గ్రామంలో ఉన్న ఐదు లింగాల దేవాలయం శిల్ప కళా సంపదకు మారుపేరు. అయితే ఈ సంపదను కాపాడటంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఎంతో వైభవం కలిగిన ఆలయం మా గ్రామంలో ఉండటం మాకు గర్వకారణం.

-సంజీవ, మలయనూరు, కుందుర్పి మండలం

వెలలేని ఆస్తి..!

ఓ రైతు వద్ద 1818 నాటి నాణెం

నాణేనికి తొలిపూజతో పంట సాగుచేస్తున్న రైతు నల్లప్ప



1818 కాలం నాటి అర్ధ అణా

1818 కాలం నాటి అర్ధ అణాపై ఒకవైపు సీతారామ లక్ష్మణ ప్రతిబింబం

శింగనమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అపురూపమైన ఆ నాణ్యం రెండు శతాబ్దాల నుంచి వంశపారంపర్యంగా పెద్దమట్లగొంది గ్రామా నికి చెందిన రైతు నల్లప్ప కుటుంబం వద్ద ఉంటోంది. ప్రస్తుతం చెలామణీలో లేని ఆ నాణ్యంను ఆ కుటుంబం భద్రంగా కాపాడుకుంటోంది. 1818లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆ అర్ధ అణా నాణ్యాన్ని ముద్రించినట్లు దానిపై ఉంది. ఓ వైపున ధాన్యపు కంకులు, ముద్రించిన సంవత్సరం, ఈస్ట్ ఇడియా కంపెనీ పేరు ఉండగా మరో వైపు సీతారామలక్షణ ఆంజనేయుడి బొమ్మలు ముద్రితమయ్యాయి. తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఈ నాణెంను ఆ కుటుంబ సభ్యులు తమ ఇంటిలో దేవుడి మూలన ఉంచి పూజలు చేస్తున్నారు. పంటలు సాగు చేసే సమయం, నూర్పిడి సమయాల్లో దేవుడి కంటే కూడా ముందుగా ఆ నాణేన్ని పూజిస్తున్నట్లు రైతు నల్లప్ప తెలిపాడు. ఇలా చేస్తే పంట బాగా పండి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్)సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు వర్సిటీ ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య సుజాత తెలిపారు. ఆమేరకు బుధవారం సీఎస్ఈ విభాగానికి ఒక అడ్మిషన్ జరిగినట్లు తెలిపారు. ఇంకా సీఎస్ఈ -02, ఈసీఈ-7 సీట్లు ఉన్నాయన్నారు. మిగిలిన సీట్లకు వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సు అభ్యసించడం ద్వారా విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. కోర్సు ఫీజు ఏడాదికి రూ.1.5లక్షలు అని తెలిపారు.

రైల్వే ట్రాక్‌తో నష్టం లేకుండా చూడండి

● కేంద్ర మంత్రికి ఎంపీ అంబికా వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుంతకల్లు మండలంలోని దోనిముక్కల, తిమ్మాపురం, కొనకొండ్ల, జి. కొట్టాల గ్రామాల్లో ప్రతిపాదిత రైల్వే ట్రాక్ వల్ల రైతులకు నష్టం లేకుండా చూడాలని రైల్వే, జలశక్తి శాఖ సహాయమంత్రి వీరన్న సోమణ్ణను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. దేశరాజధానిలో బుధవారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి, వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గుంతకల్లు ప్రాంతంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయారని, ఇప్పుడు రైల్వేట్రాక్ వెళితే మరింత నష్టం జరుగుతుందన్నారు. రైల్వేట్రాక్ మార్పుపై పునరాలోచించి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు. నర్సాపురం-ధర్మవరం (17247/17248) ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ప్రస్తుతం ధర్మవరం వరకూ మాత్రమే నడుస్తోందని, గుంతకల్లు వరకూ పొడిగిస్తే...అనంతపురం, గుంతకల్లు ప్రజలకు సులభ రవాణా సదుపాయం కలుగుతుందన్నారు. హైదరాబాద్(కాచిగూడ) నుంచి బెంగళూరు(యశ్వంత్‌పూర్)వెళ్లే వందేభారత్ ట్రైన్ హిందూపురంలో హాల్ట్ ఉండేలా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ వెంట టీడీపీ సీనియర్ నేత కేసీ హరి, సర్పంచ్ శ్రీరాములు, ఓబులేసు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా పర్యాటక శాఖాధికారి శివరామకృష్ణ

అనంతపురం టౌన్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల కోసం 2025-26 సంవత్సరానికిగాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి శివరామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ(హెచ్- హెచ్ఏ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైగా మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. ఈ కోర్సులో ఫుడ్ ప్రొడక్షన్, ఫ్రంట్ ఆఫీస్, హౌస్‌కీపింగ్ నేర్పించి, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ నాలుగు నెలలు ఇప్పిస్తామన్నారు. ఫుడ్ ప్రొడక్షన్‌లో క్రాఫ్ట్ కోర్స్, పెటిసరీ కోర్సుకు పదో తరగతి పాసైనవారు అర్హులన్నారు. ఈ కోర్సుకు ఏడాదిపాటు దేశ విదేశాల వంటకాలు నేర్పించి, ఆరు నెలలపాటు ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఫుడ్ సర్టిఫికెట్, బేవరేజ్ సర్వీస్ కోర్సుకు కూడా పదోతరగతి పాసైనవారు అర్హులన్నారు. ఈ కోర్సులో ఐదు నెలలపాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి నెలపాటు ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ కోర్సులకు వయోపరిమితి లేదని తెలిపారు. కోర్సులు పూర్తయిన తర్వాత రాష్ట్ర పర్యాటకశాఖలోని హోటళ్లు, ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 25లోపు టీటీ.ఔజీజిర్ఱుబ్ఞౌటజ వెబ్‌సైట్ లేదా 9701343846, 9100558006 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

దీర్ఘకవితల పోటీలకు ఆహ్వానం

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): దీర్ఘ కవితల పోటీలకు సాహితీవేత్తల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా ప్రతి ఏడాది సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాహితీవేత్తలు రాయలసీమ నేపథ్యంపై రాసిన దీర్ఘ కవితలను నవంబరు 1లోపు 'డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డో.నెం.1-1349, ఫ్లాట్ నెం.24, షైన్ విలాస్, టాటా షోరూమ్ వద్ద, నేషనల్ హైవే, రుద్రంపేట, అనంతపురం-515002 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 99639 17187 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్-2025' పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తోందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని రవినాయుడు స్పష్టం చేశారు.

అయోమయ పరీక్షలు..!

ధర్మవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరీక్షల విధానంలో విద్యాశాఖ తీసుకు వచ్చిన నూతన విధానం అయోమయంగా మారింది. ఈ నెల 11 నుంచి 14వతేదీ వరకు నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పరీక్షలలో పాఠశాల విద్యాశాఖ చేసిన ప్రయోగాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో రూపొందించిన ప్రశ్నపత్రాలకు అనుగుణంగా జవాబులు రాయడంలో విద్యార్థులు తెల్లమొహాలు వేశారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే టీచర్లకు కూడా చాలా వరకు ప్రశ్నలు అర్థం కాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. పరీక్షలంటే రెండు ఠావుల తెల్లకాగితాలపై జవాబులు రాసే విధానానికి స్వస్తి పలికి బుక్‌లెట్లు ముద్రించి ఏడాది పొడవునా అన్ని పరీక్షలు అందులోనే రాసుకునేందుకు విద్యాశాఖ వీలు కల్పించింది. దీంతో టీచర్లంతా సంతోషించారు. ఏడాది పాటు విద్యార్థి సామర్థ్యం అంచనా వేయడానికి ఇది ప్రామాణికంగా నిలుస్తుందని భావించారు. ప్రశ్నపత్రాలను పూర్తిగా మార్చేయడంతో ముఖ్యంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులుజవాబులు రాయడానికి ఇబ్బంది పడ్డారు.

సిలబస్‌ను కాదని..

ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లంతా సిలబస్ మేరకు పాఠాలు బోధించి అందులో నుంచే ప్రశ్నపత్రం రూపొందించేవారు. ఈనెల 11 నుంచి 14వరకు జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షల్లో బోధనకు అనుగుణంగా కాకుండా.. తార్కిక, అనువర్తిత (అప్లికేషన్ మెథడ్) విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించారు. దీంతో విద్యార్థులు జవాబులు రాయలేక పోయారని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారికి సైతం కొన్ని ప్రశ్నలు అర్థంకాలేదు. 9,10వ తరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలు యథావిధిగా ఉన్నాయని, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలతోనే తంటా వచ్చిందని మరో ఉపాధ్యాయుడు అభిప్రాయ పడ్డారు. ఒకటి, మూడు తరగతుల పిల్లలకు పెట్టిన నిబంధనలతో గందరగోళం నెలకొంది. మూల్యాంకనం చేసేందుకు టీచర్లు నానా తిప్పలు పడుతున్నారు. ఎస్‌సీఈఆర్టీ విభాగం నిర్వాకంతోనే ఎఫ్ఏ పరీక్షలు విమర్శలకు తావిచ్చిందని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

బబ్లింగ్ విధానం తొలగించాలి

ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్వహించే ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3 పరీక్షలకు సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ విధానం తీసుకువచ్చింది. ఈ పద్ధతి బాగుంది. 1 నుంచి 8వ తరగతి వరకు బబ్లింగ్ విధానం పెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

-ఆర్.చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

పోటీ పరీక్షలకు ఉపయోగం

ప్రభుత్వం రాబోవు కాలంలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకే ఈ విధానాన్ని తీసుకువచ్చింది. అందులో భాగంగా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో నిర్వహించే పరీక్షలకు ఈ విధానాన్ని అమలు చేస్తోంది. ఈ విధానానికి విద్యార్థులు అలవాటు పడటానికి సమయం పడుతుంది. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

-కిష్టప్ప, డీఈఓ

చెరువులకు మహర్దశ

ధర్మవరంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కంపచెట్లతో నిండిపోయిన చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో చెరువులకు మహర్దశ వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చెరువుల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో కట్టలమీద విపరీతంగా కంపచెట్లు పెరిగిపోయాయి. ఆయకట్టు కాలువల్లో నీరు సజావుగా పారక రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. చెరువుల వద్దకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువుల కట్టలు, ఆయకట్టు కాలువల మరమ్మతులు, కంపచెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టింది. మండలంలోని 8 చెరువులకు రూ.23.50 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తిచేశారు. దీంతో చెరువులకు మహర్దశ వచ్చినట్లయింది. వర్షాలు కురిసి నీరు చేరితే చెరువుల వద్దకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.

చెరువుకట్టను చూస్తే ఆనందంగా ఉంది



మా గ్రామంలో చెరువుకట్టపై విపరీతంగా కంపచెట్లు పెరిగి చెరువులోకి కూడా వెళ్లలేకపోయేవాళ్లం. ప్రస్తుతం చెరువుకట్టపై కంపచెట్లు, ఇతర ముళ్ల కంపలు తొలగించడంతో కట్టకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో చెరువుకట్టను చూస్తే ఆనందంగా ఉంది.

-వెంకటేష్ చౌదరి, చింతలపల్లి

ఏళ్లనాటి కంపచెట్లు తొలగించారు

మా చెరువుకట్టపై ఎన్నోఏళ్ల నుంచి కంపచెట్లు పెరిగిపోయి ఉండేవి. దీంతో చెరువుకట్ట వద్దకు వెళ్లాలంటేనే భయంగా ఉండేది. చెరువు నిండినప్పుడు చూడటానికి కట్టమీదకు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. కూటమి ప్రభుత్వం రాగానే చెరువుకట్టపై ఉన్న కంపచెట్లు తొలగించి, కట్టకింద ఉన్న మట్టిజారిపోకుండా చర్యలు తీసుకున్నారు. -బండ్ల రామకేశవులు, గొట్లూరు

చెరువు కట్టలు, కాలువలకు మరమ్మతులు

చెరువు కట్టలు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ అపరేషన్ మెయింటెనెన్స్ కింద 8 చెరువులకు రూ23.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు చింతలపల్లి, గొట్లూరు, పోతుకుంట, కట్టకిందపల్లి, సీసీకొత్తకోట చెరువు కట్టలు మీద ఉన్న కంపచెట్లు, ఆయకట్టు కాలువల్లో నీరు వెళ్లేందుకు ముళ్లకంపలు, మట్టి అడ్డులేకుండా చర్యలు చేపట్టాం. మిగిలిన చెరువుల కట్టలు, ఆయకట్టు కాలువలపై పనులు పూర్తిచేయిస్తాం.

-గురుప్రసాద్, ఏఈ, జలవనరుల శాఖ

ఖతర్ నుంచి తనకల్లుకు నూరుల్లా మృతదేహం

● టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ ఖర్చులతో స్వస్థలానికి..
● బతుకుదెరువుకు వెళ్లి 20 రోజుల క్రితం మృతి



నూరుల్లా (ఫైల్)

తనకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల కేంద్రానికి చెందిన నూరుల్లా(36) మృతదేహం ఖతర్ నుంచి స్వస్థలానికి బుధవారం చేరింది. బతుకుదెరువు కోసం నూరుల్లా నాలుగేళ్ల క్రితం ఖతర్ వెళ్లారు. వెళ్లింది మొదలు ఒక్కసారి కూడా స్వదేశానికి తిరిగిరాలేదు. ఖతర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడ చేసిన అప్పులను వడ్డీ సహా చెల్లించేశారు. మరో నెల రోజులు పనిచేసి, ఇంటికి కొంత డబ్బుతో వస్తానని కుటుంబ సభ్యులకు గత నెల 30న ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కానీ ఆ మరుసటి రోజే మృతిచెందినట్లు అక్కడి నుంచి సమాచారం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పంపేందుకు అక్కడి యజమాని డబ్బులు ఇవ్వాలని కోరడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాయం కోరారు. దీంతో ఆయన విషయాన్ని ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఖతర్‌లో ఉన్న భారతీయుల సాయం కోరారు. అలా సమస్య ఇండియన్ ఎంబసీ వరకూ వెళ్లింది. మంత్రి నారా లోకేశ్ సూచనలతో టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ నాయకులు వేమూరి రవికుమార్ స్పందించారు. నూరుల్లా మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు అయ్యే ఖర్చులను ఎన్ఆర్ఐ వింగ్ సమకూర్చింది. అలా ఖతర్ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి అంబులెన్సులో తనకల్లుకు చేర్చారు. నూరుల్లా మృతదేహాన్ని చూడగానే భార్య తల్లి ఫరియానా, సాబాజ్, కూతుళ్లు ఆయేషా, సన్నా కౌసర్, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలను పూర్తి చేశారు. సహకరించిన కదిరి ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు తెలిపారు. సెంటు భూమి లేని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధుమిత్రులు విన్నవించారు.

రుణం తీరిపోయింది..

కొవిడ్‌కు కొంతకాలం ముందు జీవనోపాధి కోసం నూరుల్లా అప్పు చేసి ఐచర్ వాహనం కొనుగోలు చేశారు. ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో రెండేళ్లు ఎలాంటి బాడుగలు రాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అప్పులవారి ఒత్తిళ్లు పెరిగాయి. వాటిని తీర్చడం ఇక్కడ సాధ్యం కాదని, ఖతర్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అక్కడికి వెళ్లాక నూరుల్లా ప్రతి నెలా డబ్బులు పంపించారు. అప్పులను వడ్డీ సహా చెల్లించమన్నాడు. ఆయన మాటను భార్య, తల్లి పాటించారు. నాలుగేళ్ల కష్టపడి అప్పులు తీర్చేశారు. ఇంకొక్క నెల పనిచేసి, చేతిలో కొంత డబ్బు తీసుకుని వస్తాను అని నూరుల్లా తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు. అంతటితో రుణం తీరిపోయింది అన్నట్లు ప్రాణాలు విడిచారు. గత నెల 31న తన యజమానిని దించేసి, తిరిగి వచ్చే దారిలో బ్రిడ్జిపై వాహనాన్ని ఆపారు. అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారా, ప్రమాదవశాత్తూ పడ్డారా అన్న స్పష్టత లేదు.



మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

విద్యాలయం కోసం..!

భూములు పరిశీలించిన కలెక్టర్



చెన్నంపల్లిలో గొడుగు పట్టుకుని భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం నిర్మాణం కోసం భూమిని గుర్తించేందుకు కంబదూరు మండలం పాళ్లూరు చెన్నంపల్లిలో కలెక్టర్ వినోద్ కుమార్ పర్యటించారు. గొల్లపల్లి, చెన్నంపల్లి గ్రామాల పరిధిలో ఉన్న భూములను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షం వస్తుండటంతో గొడుగు పట్టుకుని, రాత్రి పొద్దుపోయాక టార్చ్‌లైట్లు వేసుకుని భూములకు సంబంధించిన స్కెచ్‌లను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. చెన్నంపల్లి పరిధిలో సర్వే నెంబర్ 169, 170లో ఉన్న 30.75 ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం పాళ్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని గొల్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల మధ్యలో వున్న సర్వే నెంబర్ 242లో 158 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఆర్డీవో వసంత బాబు, డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు


అనంతపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 745 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ (వర్ధంతి)




షెహనాయ్ సంగీతవాద్య ఆలాపనలో జాతీయస్థాయిలో రాణించిన 'భారతరత్న' పురస్కార గ్రహీత 'ఉస్తాద్' బిస్మిల్లాఖాన్ 1916 మార్చి 21న బిహార్ రాష్ట్రం డుమ్రాన్ జిల్లా బిరుంగ్‌రౌట్‌కి గల్లీలో జన్మించారు. ప్రత్యేకించి దేశవాళీ ఓబో (ఒక రకమైన సన్నాయి వాద్యం) పై సత్తా చాటారు. సంప్రదాయ కార్యక్రమాలకే పరిమితమైన షెహనాయ్‌కు జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనదే. 1947 ఆగస్టు 15న ఎర్రకోటపై సన్నాయి వాయించేందుకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూచే ఆహ్వానించబడ్డారు. 2001లో అత్యున్నత 'భారతరత్న' పురస్కారం అందుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, తాన్‌సేన్ అవార్డు అందుకున్నారు. 2006 ఆగస్టు 21న కన్నుమూశారు. పాత వారణాసి ప్రాంతంలో అంత్యక్రియలకు ఆర్మీ తరపున 21సార్లు గన్ సెల్యూట్‌తో నివాళులు అర్పించారు.

లక్ష్మాగౌడ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, ప్రముఖ చిత్రకారుడు కలాల్ లక్ష్మాగౌడ్ 1940 ఆగస్టు 21న మెదక్ జిల్లా నిజాంపూర్‌లో జన్మించారు. చిత్రకళ, ముద్రణలోనే కాక డ్రాఫ్టింగ్‌లోనూ ప్రతిభ చాటుకున్నారు. బరోడాలోని మహారాజ్ సయ్యాజీ రావ్ యూనివర్శిటీ నుంచి 'ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్'లో పట్టా పొందారు. శిల్పకళ, గాజులపై చిత్రకళలో ఆరితేరారు. ప్రత్యేకించి గ్రామీణ నేపథ్యం గల శృంగారభరిత చిత్రాలలో పేరొందారు. మ్యూరల్ పెయింటింగ్‌లో రాణించారు. హైదరాబాద్ యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో పాఠాలు బోధించారు. 2016లో 'పద్మశ్రీ' పురస్కారం పొందారు. ఆయన చిత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనల్లో చోటు చేసుకున్నాయి.

ఉసేన్ బోల్ట్ (పుట్టినరోజు)



'స్ప్రింటర్' (తక్కువ దూరాన్ని ఎక్కువవేగంతో పరుగెత్తడం)గా వరల్డ్ రికార్డు నెలకొల్పిన ఉసేన్ బోల్ట్ 1986 ఆగస్టు 21న జమైకా దేశంలో జన్మించారు. పూర్తి పేరు ఉసేన్ సెయింట్ లియో బోల్ట్. 100 మీటర్లు, 200 మీటర్లు, 4/100 మీటర్ల రిలేలో ప్రపంచరికార్డులు సృష్టించారు. 8సార్లు ఒలింపిక్ బంగారు పతకం సాధించారు. 2008, 2012, 2016లలో ఒలింపిక్స్ పోటీల్లో 100, 200 మీటర్లలో వరుసగా మూడుసార్లు పతకం గెలుపొందిన ఏకైక వ్యక్తి. ఐఏఏఎఫ్ వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్, బీబీసీ ఓవర్సీస్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ (మూడుసార్లు) తదితర పురస్కారాలు అందుకున్నారు. 2017 వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల తర్వాత రిటైర్మెంట్ ప్రకటించారు. 19 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన ఘనత ఆయనది.

ఆర్థిక కోర్సుల కోసం ఎన్ఐఎస్ఎంతో ఐఎస్ఎంఈ ఒప్పందం



ఒప్పందంలో నితిన్‌గార్గ్, రోని కురియన్

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి), శిక్షణా సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ (ఎన్ఐఎస్ఎం) తో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ ఎక్సలెన్స్ బెంగళూరు సంస్థ కీలక ఒప్పందం చేసుకుంది. బుధవారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎస్ఎంఈ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ నితిన్ గార్గ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ సంబంధిత నైపుణ్యతను కల్పించడమే ఆశయమన్నారు. ఫైనాన్స్ విభాగంలో భవిష్యత్తుకు అనుకూలమైన వృత్తిపర కోర్సులను రూపొందించదలిచామన్నారు. మూడేళ్ల పాటు ఒప్పందం చేసుకున్నామని, ఏటా 300మంది విద్యార్థులకు సౌలభ్యాలు కల్పిస్తామన్నారు. ఐఎస్ఎంఈ డీన్ రోని కురియన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

హిందూపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆధార్ జిరాక్స్ తీసుకురావాలన్నారు.

శిక్షణకు దరఖాస్తులు

పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలల పాటు ఉచిత బ్యూటీషియన్, కంప్యూటర్ కోచింగ్‌పై శిక్షణిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 18-35ఏళ్ల వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికెట్లతోపాటు ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 9676706976 నంబరును సంప్రదించాలన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

హిందూపురం ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశం కోసం నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. 20 నుంచి 26వ తేదీవరకు ఇంటర్‌పాసైన విద్యార్థులు రిజిష్టర్ చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు 24నుంచి 28వరకు ఉంటాయన్నారు. సీట్ల కేటాయింపు 31న తెలియజేస్తారన్నారు. ఇతర వివరాల కోసం కళాశాల పనిదినాల్లో సంప్రదించాలన్నారు.



ముళబాగిలు పురవీధులలో దేవరాజ్ అరసు ఊరేగింపు



బంగారపేట తాలూకా కార్యాలయంలో దేవరాజ్ అరసు జయంతి



బాగేపల్లిలో అరసు జయంతిలో విద్యార్థులకు సన్మానం

దూరదృష్టి నేత దేవరాజ్ అరసు

» జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అరసు దూరదృష్టిగల నేత అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బెంగళూరు సహా జిల్లా, తాలూకా పంచాయతీల ఆధ్వర్యంలో, కళాశాలల్లో బుధవారం దేవరాజ్ అరసు ఘనంగా సాగింది.

ముళబాగిలు.లో..

ముళబాగిలు: మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అరసు దూరదృష్టి వల్ల పాలనలో మంచి సంస్కరణలు, విప్లవాత్మకమైన మార్పు సాధ్యమైందని, వెనుకబడిన వర్గాల ఆశాకిరణమని అహింద ఉద్యమ రాష్ట్ర సంయుక్త ప్రధాన సంచాలకులు ఎన్ వెంకటేశ్‌గౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని మినీ విధానసౌధలోలో తాలూకా యంత్రాంగం, వెనుకబడినవర్గాల సంక్షేమశాఖ, తాలూకా వెనుకబడిన వర్గాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం దేవరాజ్ అరసు 110వ జయంతిని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వీ గీతా మాట్లాడుతూ అత్యంత శ్రేష్ఠ ముఖ్యమంత్రిగా దేవరాజ్ అరసు గుర్తింపు పొందారని, సామాజిక న్యాయం కోసం ఎంతో కృషి చేశారన్నారు. నవసమాజ నిర్మాణంకోసం పాటుపడ్డారన్నారు. దున్నేవాడిదే భూమి అమలుతోపాటు చేతితో మలం తొలగించే పద్ధతిని వెట్టిచాకిరీ వ్యవస్థకు స్వస్తి పలికారన్నారు. భూసంస్కరణల చట్టంతో లక్షలాదిమందికి వీలు కల్పించారన్నారు. దళిత నాయకుడు సంగసంద్ర విజయ్ కుమార్ మాట్లాడుతే సామాజిక న్యాయ పరికల్పనతో దేశంలో ఉత్తమ పాలన అందించిన సీఎంగా దేవరాజ్ అరసు గుర్తింపు పొందారన్నారు. పట్టణవీధులలో దేవరాజ్ అరసు చిత్రపటంతో ఊరేగారు. హాస్టల్ విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమితి సభ్యుడు రఘునాథ్, కాంగ్రెస్ టౌన్ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, దేవదాయశాఖ అధికారి కేవీ సుబ్రమణ్యం, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అరసు ఆదర్శాలు అనుసరణీయం

బంగారపేట: దశాబ్దాల క్రితమే సామాజిక న్యాయం కోసం దేవరాజ్ అరసు ఎంతో కృషి చేశారని, ఆయన ఆదర్శాలు అనుసరణీయమని, అహంకారంతో వ్యవహరించేవారిని ప్రజలు ఆదరించరని, తాను ఎవరనేది అభివృద్ధి చేసి చూపాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయ సభాంగణంలో బుధవారం జాతీయ పండుగల ఆచరణ సమితి, వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దేవరాజ్ అరసు 110వ జయంతి జరిగింది. ఈ సందర్భంగా దేవరాజ్ అరసు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అహంకారం వల్ల ప్రజలు ఆదరించరు అనేందుకు వేమగల్, కురగల్ పట్టణ పంచాయతీ ఉదాహరణ అన్నారు. కోలారు జిల్లాలో తాను ఒక దళిత ఎమ్మెల్యేనని, సౌజన్యం కోసం కూడా పట్టణ పంచాయతీలకు తనను పిలవలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఎవరైనా దళితులు, మైనారిటీలు, బీసీలను నిర్లక్ష్యం చేస్తే, తనకు పట్టినగతే ఇతరులకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశప్ప, పురసభ అధ్యక్షుడు గోవింద, బీసీ వర్గాల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, బీఈఓ గురుమూర్తి, కాంగ్రెస్ నాయకుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అరసు ఆశయాలు నేటికీ అనుసరణీయమని తహసీల్దార్ మనీషా మహేశ్ పత్రి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అరసు అభవనంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా యంత్రాంగం మాజీ సీఎం దేవరాజ్ అరసు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేవరాజ్ అరసు తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవనంలో ఎనిమిదేళ్లపాటు సీఎంగా వ్యవహరించి రాష్ట్రంలో నవ సమాజ నిర్మాణానికి చక్కటి పునాదులు వేసి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. కేఎం నయాజ్ అహ్మద్ మాట్లాడుతూ వెనుకబడిన, దళితుల, పేదల మనస్సులలో దేవరాజ్ అరసు చిరస్మరణీయంగా ఉంటారన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, అనాథలకు పెన్షన్లు జారీ చేశారన్నారు. గ్రామీణ ప్రాంత పిల్లల ఆరోగ్యరక్షణకోసం పౌష్టికాహారం పంపిణీ, భాగ్యజ్యోతి ద్వారా నిరుపేదల ఇళ్లల్లో దీపాలు వెలిగించేలా చేశారన్నారు. ఇదే సందర్భంగా 2024-25 ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, డిగ్రీలలో ఎక్కువమార్కులు సాధించిన బీసీ విద్యార్థులను వేదికపై సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ రమేశ్, విస్తరణాధికారులు ఆర్ శివప్ప, బీఈఓ వెంకటేశప్ప, ఆర్ హనుమంతరెడ్డి, సోమశేఖరరెడ్డి, శివప్ప, బీసీ సంక్షేమశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డబళ్ళాపురలో...

దొడ్డబళ్ళాపుర: వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయధ్వనిగా దేవరాజ్ అరసు పేరొందారని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జాలప్ప గ్రూప్ విద్యాసంస్థ, లయన్స్‌క్లబ్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో బుధవారం దేవరాజ్ అరసు జయంతి, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. విద్యాసంస్థల అధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ, దేవరాజ్ అరసులు తమ పాలనలో దూరదృష్టితో సమాజ పురోగతికి చక్కటి బాటలు వేశారని కొనియాడారు. ప్రత్యేకించి సామాజిక న్యాయ కల్పనతో దేవరాజ్ అరసు ఎన్నో సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరేలా చేశారన్నారు. నేటికీ అలాంటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కాగా రాజీవ్‌గాంధీ డిజిటల్ ఇండియా పరికల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. ఓటుహక్కు 18ఏళ్లకు వచ్చేలా చేసి యువశక్తిని ప్రోత్సహించారన్నారు. ఈ సందర్భంగా సద్భావనాదినం ప్రతిజ్ఞ చేశారు. విద్యాసంస్థ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు తేజస్విని, జేఆర్ రాకేశ్, విద్వత్, మానవ వనరుల విభాగం డైరెక్టర్ ఎన్ఎస్ బాబరెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి: పట్టణంలోని తాలూకాపంచాతీయ సామర్థ్యసౌధలో తాలూకా యంత్రాంగం, నగరసభ, తాలూకా పంచాయతీ, బీసీ సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో దేవరాజ్ అరసు 110వ జయంతిని బుధవారం నిర్వహించారు. తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కల్పించిన గొప్పనేతగా దేవరాజ్ అరసు పేరొందారన్నారు. ఆయన ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆత్మీయంగా సత్కరించారు. తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, బీఈఓ ఉమాదేవి, నగరసభ కమిషనర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.



దొడ్డబళ్ళాపురలో దేవరాజ్ అరసు జయంతి



చింతామణిలో విద్యార్థులకు సన్మానం

వీరశైవులు ఇష్టలింగపూజ చేయాలి

» మహంతలింగ శివాచార్య స్వామిజీ

మహదేవపుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత కుటుంబాలలో ప్రతి ఒక్కరూ ఇష్టలింగ పూజ చేయాలని విభూతిపుర వీరసింహాసన సంస్థాన మఠాధిపతి డాక్టర్ మహంతలింగ శివాచార్యస్వామిజీ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని కాటంనల్లూరు ప్రైవేట్ కల్యాణమండపంలో మహదేవపుర వీరశైవలింగాయత క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస విశేషపూజలపై ప్రత్యేక ప్రవచనం నిర్వహించారు. నిత్యపూజ చేసే సంప్రదాయం మన ధర్మంలో ఉందని, వీరశైవ లింగాయత కుటుంబీకులు ప్రతి ఒక్కరూ ఇష్టలింగపూజ చేసే అంశంపై జాగృతి కల్పిస్తున్నామన్నారు. మహాభారతం, భగవద్గీ, 18 స్కందపురాణాలు రచించిన వ్యాసమహర్షి పేర్కొన్నట్టుగా వీరశైవ లింగాయతలు తమ శరీరంపై నిత్యలింగాన్ని ధరించి, ప్రతిరోజూ లింగానికి ఓం నమఃశివాయ అని జపం చేయాలని స్వామిజీ అభిప్రాయపడ్డారు. సమాజంలో పలు మతాలు, ధర్మాలు ఉన్నాయని వారి వారి ధర్మాలు గొప్పవన్నారు. ఎవరు ధర్మాన్ని కాపాడుతారో వారిని పరమాత్ముడు కాపాడుతారన్నారు. క్షేమాభివృద్ధిసంఘం అధ్యక్షుడు మహేంద్ర మోది మాట్లాడుతూ శ్రావణమాసంలో 18 ఏళ్లుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల్లో ఉత్తమ సంస్కారం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా స్వామిజీని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఎస్ ప్రకాశ్, పంచాక్షరి హిరేమఠ్, బైరతి కుమార్, కార్తిక్ శివుగురు, రఘుకుమార్, మోహన్, యోగేశ్ ఆరాధ్య ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మహంతలింగ శివాచార్యస్వామిజీకి సన్మానం

కల్లే శివోత్తమరావుకు దేవరాజ్ అరసు పురస్కారం

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సమానత్వం కోసం దేవరాజ్ అరసు ప్రామాణికంగా పాటుపడ్డారని, ఆయన పేరిట కల్లే శివోత్తమరావుకు పురస్కారం ఇవ్వడం సంతోషమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. దేవరాజ్ అరసు 110వ జయంతి సందర్భంగా బుధవారం విధానసౌధ బాంక్వెట్‌హాల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ దేవరాజ్ అరసు ఎనిమిదేళ్లపాటు సీఎంగా ఉన్నారని, ఆ తర్వాత ఎక్కువకాలం సీఎంగా కొనసాగుతుండేది నేనే అన్నారు. మా ఇద్దరి మధ్య సారూప్యం ఉందన్నారు. అరసు రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం వచ్చేలా సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం లభించాలని భావించారన్నారు. బసవణ్ణ శతాబ్దాలకిందటే సమానత్వంకోసం పాటుపడ్డారన్నారు. సమాజంలో మార్పుకోసం కల్లే శివోత్తమరావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగితోపాటు పలువురు పాల్గొన్నారు.

టర్మ్ ఇన్సూరెన్స్‌లో కర్ణాటక ఆసక్తి

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): టర్మ్ ఇన్సూరెన్స్ పొందేవారిలో జాతీయ సరాసరికంటే కర్ణాటకలో ఎక్కువశాతమని పాలసీబజార్ డాట్‌కామ్ ముఖ్యులు వరుణ్ అగర్వాల్ ప్రకటించారు. బుధవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి సర్వే జరిపామన్నారు. కర్ణాటక నికరమైన ప్రగతితో కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. బెంగళూరుతోపాటు అన్ని జిల్లాల్లో పాలసీదారులు పెరుగుతున్నారన్నారు. వార్షిక బీమా 1.2కోట్లుగా ఉందన్నారు. టర్మ్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసేవారిలో పట్టభద్రులు అధికమని, 85.8 శాతం ఉండగా, జాతీయ సరాసరిలో 78.6శాతం మాత్రమే అన్నారు. బెంగళూరులో 88.9శాతం ఉందన్నారు. ఉద్యోగులలో రాష్ట్రంలో 80, బెంగళూరులో 90శాతం కాగా జాతీయసరాసరిలో 70 శాతం మాత్రమే అన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

శిడ్లఘట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనుకబడిన, దళితుల, మైనారిటీల పరంగా పోరాడేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని 13వ వార్డు ప్రేమ్‌నగర్ సహా వివిధ లే అవుట్‌లలో ఏర్పాటైన కార్యక్రమాలలో పార్టీలోకి చేరిన కొత్తవారిని పార్టీ కండువాతో స్వాగతించారు. ఏ ఒక్క కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని సముదాయాలలో వెనుకబడినవర్గాలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టెలికాం మాజీ డైరెక్టర్ బీకే వెంకటేశ్, బురుడుగుంటె నాగరాజ్, చౌడసంద్ర రవిచంద్ర, ఎం సయ్యద్ సలీం, మునియప్ప, ద్యావప్ప, గోపిస్వామి, గేట్ మురళి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.



రాజీవ్‌గౌడ సమక్షంలో చేరిన కార్యకర్తలు

అధికమవుతున్న మయోపియా బాధితులు



మీడియాతో వైద్యబృందం

మహదేవపుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గతంతో పోలిస్తే ఇటీవలి పదేళ్లలో ఎక్కువ సమయం స్క్రీన్‌ను చూడడం, బయటి కార్యక్రమాలలో పాల్గొనడం తగ్గడంతో మయోపియా (హ్రస్వ దృష్టి), ఆస్టిగ్మాటిజం బాధితులు పెరిగారని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నిపుణులు అభిప్రాయపడ్డారు. వైద్యనిపుణులు మీడియాతో మాట్లాడుతూ ఐటీ రంగంలో, ఎక్కువగా స్క్రీన్ చూసే పిల్లలు, యువకులలో మయోపియా బాధితులు ఉన్నారన్నారు. అంటే దూరపు వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వీటికి సరికొత్తగా చికిత్సలు అందించేలా కంటోరా ఎక్సిమర్ లేజర్ అనే సరికొత్త విజన్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చామన్నారు. తద్వారా చికిత్సలు సులభతరం కానున్నాయన్నారు. అయినా కూడా కంటిచూపు పట్ల నిర్లక్ష్యం సరికాదని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఫైబ్రాయిడ్ బాధిత మహిళకు శస్త్రచికిత్స విజయవంతం

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ళుగా ఫైబ్రాయిడ్‌తో బాధపడుతున్న మహిళకు శస్త్రచికిత్స ద్వారా విజయవంతం చేసినట్లు మెడి కవర్ ఆసుపత్రి గైనకాలజిస్టు సంస్కృతి తెలిపారు. బుధవారం ఆపరేషన్‌కు సంబంధించి ఒక ప్రకటన విడుదల చేశారు. పొత్తికడుపు నొప్పితో పాటు కడుపు కిందిభాగంలో భారంతో ఇబ్బంది పడుతున్న 28 ఏళ్ళ మహిళ వివిధ ఆసుపత్రులలో చికిత్సలు పొందినట్లు పేర్కొన్నారు. నాలుగేళ్ళుగా మహిళ ఇబ్బంది పడుతుండేవారు. మెడికవర్‌కు వచ్చిన తర్వాత పలు పరీక్షలు జరుపగా గర్భాశయంలో ఫైబ్రాయిడ్‌లు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. 12సెంటీ మీటర్‌ల బ్రాడ్ లిగమెంట్ కణతి ఉన్నట్లు నిర్ధారించామన్నారు. ఇది మూత్రనాళంపై ఒత్తిడి తీసుకురానుందని ఆపరేషన్ జాప్యం చేస్తే కిడ్నీ వైఫల్యానికి కారణం కావచ్చునని డాక్టర్‌ల బృందం నిర్ధారించామన్నారు. బాధిత మహిళతో పాటు కుటుంబ సభ్యులకు సమస్యను వివరించి సాధారణ ఆపరేషన్ కూడా సాధ్యం కాదని రోబోటిక్ మయోమెక్టమీ సర్జరీ చేసి విజయ వంతం చేశామన్నారు. రెండు కణితలను తొలగించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

'మత్తుకు బానిస కావద్దు'

గోరంట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐలు శేఖర్, గోపీనాథ్ సూచించారు. పట్టణంలోని ఎస్ఏపీఎస్ ఎయిడెడ్ జూనియర్, ఏఎన్‌కే డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐలు, ఈగల్ విభాగం అధికారులు, డ్రగ్స్, తాగుడు లాంటి మత్తుపదార్థాలకు బానిసలై సర్వనాశనమైన జీవితాలను ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ వాడకం, కార్యకలాపాలను విద్యార్థులు 1972కు సమాచారం అందించాలని కోరారు. కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, అధ్యాపకులు రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

చావు మలుపులు..!

- కదిరి నుంచి చీకటిమానుపల్లి వరకు అనేక మలుపులు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు

కదిరి/ తనకల్లు/ నల్లచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కదిరి నుంచి, చీకటిమానుపల్లి వరకు ఉన్న జాతీయ రహదారి మలుపులు అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కదిరినుంచి చీకటిమానుపల్లి వరకు దాదాపు 35 కిలోమీటర్ల పరిధిలో చాలా డీప్ కర్వులు ఉన్నాయి. ఈమలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. అతి రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారిని నాలుగే లేన్లుగా విస్తరిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

కదిరి నుంచి జిల్లా సరిహద్దుగా ఉన్న తనకల్లు మండలంలోని చీకటిమానుపల్లి వరకు అనేక మలుపులున్నాయి. ఈమలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదు. ముఖ్యంగా నల్లచెరువు మండలంలోని పెద్దయల్లంపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు పూర్తిగా కనిపించవు. ఈమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే పాత రైల్వేస్టేషన్ వద్ద కూడా ఇదే పరిస్థితి. గతంలో నల్లచెరువు సాయిబాబా గుడి వద్ద మలుపులో జరిగిన ప్రమాదంలో 11మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తనకల్లు మండలంలోని పరాకువాండ్లపల్లి, మండ్లిపల్లి, నల్లగుట్లపల్లి, గంగసానిపల్లి, కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంక్, చీకటిమానుపల్లి వద్ద ప్రమాదకరమైన మలుపులున్నాయి. రాత్రి సమయంలో వాహనం దగ్గరికి వచ్చే వరకు గుర్తించే పరిస్థితి లేదు. దీంతో దగ్గరికి వచ్చిన సమయంలో వాహనాలను డ్రైవర్లు అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

- తనకల్లు మండలంలో జాతీయ రహదారి మలుపుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- పరాకువాండ్లపల్లి సమీపంలో రోడ్డు మలుపు ఉండటంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత మూడునెలల్లో మూడుమార్లు ప్రమాదాలు జరిగాయి.
- మండ్లిపల్లి మిట్ట, మండ్లిపల్లి సమీపంలో రోడ్డు మలుపుల వల్ల గత మూడు నెలల్లో ఐదు ప్రమాదాలు జరిగి నలుగురు మృతి చెందారు.
- మండలంలోని గంగసానిపల్లి, నారేవాండ్లపల్లి మధ్య రెండునెలల కిందట జరిగిన ప్రమాదంలో నల్లమాడకు చెందిన కూలీలు మృతి చెందారు. చీకటిమానుపల్లి, ఈదులవంక మధ్యలో మూడునెలలో నాలుగురు ద్విచక్రవాహనదారులు మృతి చెందారు.
- నల్లచెరువు మండలంలోని పెద్దయల్లంపల్లి మలుపు వద్ద ఈ ఏడాది మే 11న ఆగి ఉన్న ఐషర్ వాహనాన్ని ఓ కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందారు.
- పాత రైల్వేస్టేషన్ మలుపు వద్ద ఈనెల 17న ఆటోను కారు ఢీకొంది. దీంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ● సంత తోపు వద్ద కర్ణాటక రాష్ట్రంలోని చింతామణికి చెందిన బొలెరో వాహనం ఈనెల 7న గ్యాస్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు.



మూడు రోజుల కిందట తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన వాహనాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.42	1,624.58
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	89,411	37,687
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1.17.057	10,275
నీటి నిల్వ (టీఎంసీలు)	74.61	75.13

యువకుడి నేత్రాలు దానం



సంతోష్ (ఫైల్)

కంప్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కంప్లి తాలూకాలోని బలాపురం గ్రామానికి చెందిన సంతోష్ అరికేరి (20) బుధవారం బెంగళూరు పట్టణంలో విక్టోరియా ఆస్పత్రిలో నేత్రాలను దానం చేశారు. సంతోష్ బెంగళూరులో ఆదివారం కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి రైలు కిందపడి గాయపడ్డారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో వారు నేత్రదానం చేశారు.

రేపటి నుంచి రక్తదాన శిబిరాలు

● బ్రహ్మకుమారి రాజయోగి స్మిత



మాట్లాడుతున్న రాజయోగి స్మిత

రాయచూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పూర్వపు రాజయోగిని దాది ప్రకాశమని 18వ ఉద్ధర్తిని పురస్కరించుకుని ఈనెల 22 నుంచి 25 వరకు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగిని స్మిత తెలిపారు. నగరంలోని ప్రజాపీత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వ విద్యాలయం వద్ద బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. రాజయోగిని దాది ప్రకాశమని జయంతిని ఈ ఏడాది విశ్వ బ్రాతృత్వ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని 150 చోట్ల బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు 4 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం ప్రాణదానంతో సమానమన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4 రోజుల పాటు దాదాపు లక్ష యూనిట్‌లకు పైగా రక్తాన్ని వివిధ ఆస్పత్రులకు దాతల ద్వారా అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రక్తదానానికి యువతీయువకులు, చిన్నా పెద్ద కదిలి రావాలన్నారు.

భూగర్భజలం పెంపుపై అవగాహన

అమరాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువు, సాగునీటి సంఘం పరిధిలో భూగర్భజలాలు పెంచడానికి కృషిచేయాలని ఎంపీడీఓ రామారావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 14 సాగు నీటి సంఘాల అధ్యక్షులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ, ఏఈ భార్గవ్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలోని ఇరిగేషన్ పరిధిలోని చెరువులు, చిన్నకుంటలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పరిధిలో రైతు పొలాల్లో చిన్న చిన్న కుంటల అభివృద్ధి పరచడానికి చర్యలు చేపట్టాలని ఏపీఓ శివన్న చెరువు సంఘాల అధ్యక్షుడు నరసింహమూర్తి కోరారు.

సామాజిక విప్లవానికి మార్గదర్శకుడు

● పేదల అభ్యున్నతికి పరితపించిన మహనీయుడు దేవరాజు అరసు: జయంతి వేడుకల్లో వక్తలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న లిడ్కర్ అధ్యక్షుడు ముండరగి నాగరాజు



ప్రొఫెసర్ వెంకటగిరి దళవాయి

బళ్లారి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు గుర్తింపు తెచ్చిన మాజీ ముఖ్యమంత్రి దేవరాజు అరసు సామాజిక విప్లవానికి మార్గదర్శకుడని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండరగి నాగరాజు అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా స్టేడియంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో బుధవారం నిర్వహించిన సామాజిక న్యాయదర్శకుడు, వెనుకబడిన తరగతుల నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి దేవరాజు అరసు 110వ జయంతి వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేవరా 1872నుంచి 1980 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారని, కర్ణాటకలో ఆయన అరుదైన రాజకీయ నాయకుడని, పేదలకు సామాజిక న్యాయం అందించాలన్న ఉద్దేశంతో విప్లవాత్మక పథకాలను అమలు చేశారన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు , వెనుకబడిన తరగతులకు ఎన్నో ప్రయోజనాలు అందించారన్నారు.
మహానగర పాలక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ మానవుడు దేవుడిగా మారలేరని, మనిషి మనిషికి సహాయంచేసినప్పుడే దానిలో ఉండే గొప్పతనం అర్థం అవుతుందన్నారు. హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నిర్దేశించిన మార్గంలోనే ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో ఐదు హామీ పథకాలను అమలు చేయడం ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలతో సహా సమాన సమాజాన్ని సృష్టించడంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముందున్నారన్నారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్, జిల్లా అదనపు పోలీస్ సూపరింటెండెంట్ రవికుమార్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి జలాలప్ప, విశ్వకర్మ అభివృద్ధి సంస్థడైరెక్టర్ చంద్రశేఖర్, మహానగర పాలక సంస్థ మేయర్ గాదెప్ప, నాయకులు కల్లుకంబ పంపాపతి, మారెన్న, గాదిలింగనగౌడ, మంజుళ, వివిధ వెనుకబడిన తరగతుల సంఘాల అధ్యక్షులు, అధికారులు, సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి నాగేంద్ర కార్యాలయంలో..

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి): నగరంలో మాజీమంత్రి నాగేంద్ర కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతిని, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి దేవరాజు అరసు 110వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బగరు హుకుం అధ్యక్షుడు సిద్దంపల్లి తిమ్మన్నగౌడ, ఎర్రగుడి ముద్ద మల్లయ్య, కొలగల్లు హులియప్ప, వీకే బసప్ప, భోగి సంఘ అధ్యక్షులు రామాంజనేయులు, పద్మశాలి నాయకులు శ్రీరామరాజు, మహానగర పాలిక డైరెక్టర్ వల్ల కార్పొరేటర్ ఆసిఫ్ బాషా, నాగలకేరి గోవిందు, మాజీ మహానగరపాలిక సభ్యులు రామాంజిని, నాగరాజు అల్లిపుర వెంకటస్వామి, అక్కి శివ కుమార్, మల్లేశ్వరి, వెంకటేష్, అరుణ్‌కుమార్, శ్రీకాంత్ గ్యారెంటీల సంఘం ఉపాధ్యక్షుడు సంగనకల్లు, విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉమేష్‌గౌడ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయంతి వేడుకలు నిర్వహించారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దేవరాజు అరసు సేవలు అమోఘమని బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ కే మల్లికార్జున తెలిపారు. బుధవారం సిరుగుప్ప పట్టణం తాలుకా పరిపాలన, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దేవరాజ అరసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ గౌసియా బేగమ్ ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అని చట్టాన్ని జారీ చేసిన ఏకైక వ్యక్తి అని అన్నారు. వెనుకబడిన వర్గాలు, దళితుల కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్, నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, సమాజసేవకుడు అబ్దుల్ నబీ, రాణిగ సమాజం అధ్యక్షులు చలపతి, కృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సమాజ సభ్యులు పాల్గొన్నారు.



అరసుకు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సిరుగుప్పలో..

డిజిటల్ విప్లవకారుడు రాజీవ్‌గాంధీ

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీకే బసప్ప



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు వీకే బసప్ప

బళ్లారి సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశానికి డిజిటల్ టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీకే బసప్ప అన్నారు. బుధవారం నగరంలోని నెహ్రూ కాలనీలోని బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ డాక్టర్ దేవరాజు అరసు 81, 110వ జయంతి వేడుకల్లో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తన అతి తక్కువ పదవీకాలంఁ దేశానికి ఆటోమొబైల్ రంగాన్ని పరిచయం చేశారన్నారు.రాజీవ్‌గాంధీ పంచాయితీ రాజ్ చట్టాన్ని అమలు చేసి సామాన్య ప్రజలకు అధికారాన్ని అందించారన్నారు. అదేవిధంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధికి మార్గదర్శకుడిగా పేరుగాంచిన డాక్టర్ దేవరాజ అరసు రాష్ట్రానికి అపారమైన కృషిచేశారన్నారు. భూ సంస్కరణల చట్టం తన పరిపాలనలోని ప్రధాన ప్రాజెక్టులలో ఒకటి అని ముఖ్యమంత్రిగా పూర్తి పదవీ కాలం పూర్తి చేసిన మొదటి ముఖ్యమంత్రి అని అన్నారు. బగర్ హుకుమ్ అధ్యక్షుడు తిమ్మనగౌడ, ముండరగి నాగరాజు, చిదానందప్ప, ముది మల్లయ్య, రామాంజిని, నాగలకెరె గోవింద్, నాగభూషణ్‌గౌడ, అల్లాబకాష్, శ్రీరామరాజు, ఆసిప్, యతీంద్ర, గంగాధర, విజయ్‌కుమార్, జగన్నాథ, బెనకల్ బసవరాజు, ధనంజయ పాల్గొన్నారు.



రోడ్ మార్చ్‌లో ఎస్పీ శోభారాణి, అడిషనల్ ఎస్పీ రవికుమార్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్పీ శోభారాణి

బళ్లారి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం సాయంత్రం ఎస్పీ డాక్టర్ శోభారాణి, అడిషనల్ ఎస్పీ రవికుమార్, నవీన్ కుమార్ నేతృత్వంలో రోడ్‌మార్చ్ నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా నగరంలో ఎస్పీ ఆఫీసు కనకదుర్గమ్మ గుడి నుంచి రాయల్ సర్కిల్ బెంగళూరు రోడ్డు బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ సర్కిల్, మోతి సర్కిల్, కౌల్ బజార్ తదితర ప్రాంతాల్లో పోలీసుల మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక చవితి, ఈద్ మిలాడ్ నబి శాంతియుతంగా జరుపుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రకాంతనంద రెడ్డి, సీఐలు మాంతేష్, రవిచంద్ర, అయ్యన్న గౌడ పాటిల్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

తోరణగల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా కురేకుప్ప పట్టణంలోని మార్కండేయస్వామి దేవస్థాన ఆవరణంలో పద్మశాలి బహుఉత్తమ నేకార సమాజ సంఘం ఆధ్వర్యంలో వధూవరుల పరిచయ వేదిక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జక్కా తిప్పయ్యస్వామి మాట్లాడుతూ ఇటీవల అమ్మాయి, అబ్బాయిలకు పెళ్లి కావడం కష్టంగా మారిందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగస్తులు కావాలని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులు కావాలన్న ఆలోచనతో వివాహాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. పద్మశాలి సంఘం ప్రెసిడెంట్ బ్రహ్మయ్య, మహిళా సమాజ సంఘం అధ్యక్షులు మీనాక్షమ్మ ప్రసంగించారు. మహిళా సంఘం కార్యదర్శి సరోజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోరణగల్లు పద్మశాలి సంఘం కార్యదర్శి సరోజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోరణగల్లు పద్మశాలి సంఘం వైస్‌ప్రెసిడెంట్ గంగాధర సెక్రెటరీ పులిపాటి శ్రీధర్, గౌరవ సలహాదారులు వెంకటేశులు, ఉమాపతి, రంగయ్య, కురేకుప్ప పద్మశాలి సంఘం అధ్యక్షుడు సూరప్ప, పద్మశాలి సంఘం పదాధికారులు, పట్టణ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

హింసకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న సమాచార శాఖ అధికారి వీసీ గురురాజా

బళ్లారి సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గుడ్ విల్ డే వేడుకల్లో భాగంగా బుధవారం సమాచార ప్రజాసంబందాల శాఖ కార్యాలయంలో బుధవారం ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఆశాఖ సమాచార సహాయకుడు వీసీ గురురాజా వేడుకలను ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. కులం, మతం, ప్రాంతం, మతం లేదా భాషా బేదం లేకుండా భారతదేశంలోని ప్రజలందరి ఐక్యత, సామరస్యం కోసం కృషి చేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. హింసను ఆశ్రయించకుండా, చర్చలు నిర్మాణాత్మకచర్యల ద్వారా వ్యక్తిగతంగా కానీ, సమష్టిగాగానీ మన మధ్య ఉన్న అన్ని విభేదాలను పరిష్కరించుకుంటామని కూడా నేను ప్రతిజ్ఞ చేస్తున్నానని ప్రమాణంచేశారు. కార్యాలయ సిబ్బంది రోజ్మేరీ, విజయ్‌కుమార్, హనుమంత, మల్లేశప్ప, హనుమేశ్, తేజ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

హోసూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హోసూరు పంచాయతీ యూనియన్ పరిధిలో రూ.32.52లక్షలతో పలు అభివృద్ధి పథకాలకు ఎమ్మెల్యే ప్రకాశ్ భూమిపూజ చేశారు. సిమెంటురోడ్డు, మురుగుకాలువ తదితర పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బెలత్తూరు పంచాయతీ యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి మాట్లాడుతూ పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ఉపకార్యదర్శి శ్రీనివాసన్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, శూలగిరి నార్త్ యూనియన్ కార్యదర్శి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

హోసూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం అర్థవంతంగా నిర్వహించారు. నగరంలోని ఎంజీ రోడ్డులోగల మహాత్మాగాంధీ విగ్రహానికి, రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధరన్ నేతృత్వంలో నివాళులు అర్పించారు. మాజీ ప్రధానిగా రాజీవ్‌గాంధీ పాలనలో చేపట్టిన సంస్కరణలు, దూరదృష్టి నేటికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. హోసూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్యాగరాజన్, నగర కోశాధికారి వెంకటేశ్, మహిళా బృందం నాయకురాలు సరోజ, మానవహక్కుల విభాగం జిల్లా అధ్యక్షుడు బైరోస్, అబ్బాస్, సెల్వం, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉప్పొంగుతున్న తుంగభద్ర



హంపిలో నీట మునిగిన స్నాన ఘట్టాలు




ఆలయంలోకి చేరిన తుంగభద్ర నీరు

(5వపేజీ తరువాయి)

ప్రమాద సూచిక స్థాయిలో పొంగి ప్రవహిస్తోంది. మూడు నాలుగు రోజులుగా బళ్ళారి-కొప్పళ జిల్లాల వారధిగా ఉన్నకంప్లి వంతెన వరద ప్రవాహంలో మునిగి పోగా ఆ మార్గం గుండా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పర్యాయ మార్గాల ద్వారా వెళ్ళడంతో ప్రయాణ భారం ఎక్కువ అవుతోంది. హంపిలో కృష్ణదేవరాయల సమాధితో పాటు , పురందర దాసుల మంటపాలు మునిగిపోయాయి. గంగావతి తాలూకా పరిధిలోని సణాపుర గ్రామం వద్ద కొండప్రాంతాల్లో నడుమ వరద నీరు ప్రవాహం ప్రమాదం దాటి ప్రవహిస్తోంది. సుందరమైన దృశ్యాన్ని తిలకించడానికి చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు కొండరాళ్ళపై కూర్చొని తుంగభద్ర పరవళ్ళు చూస్తూ నయనానందం పొందుతున్నారు. ఆనెగొంది గ్రామంలో చింతామణి వద్ద చారిత్రక మంటపాలు నీటి మునిగాయి. నీటి ఉధృతి కారణంగా హంపి విరుపాక్షేశ్వర దేవస్థానం సమీపంలో స్నాన మంటపం దాదాపు మునిగి పోగా భక్తులు నదివద్దకు వెళ్ళాళంటేనే భయడపతున్నారు. హంపి చక్రతీర్థ వరద నీటితో పొంగి ప్రవహిస్తుండడం విశేషం.



పొలాలను ముంచెత్తిన వరద నీరు



నీటమునిగిన ఆనెగొంది చారిత్రక కట్టడాలు

తొణికిసలాడుతున్న డ్యామ్

తుంగభద్ర రోజురోజుకు ఉగ్రరూపం దాలుస్తోంది. క్షణ క్షణానికి వేలాది క్యూసెక్కుల వరద నీరు చేరుతుండడంతో డ్యామ్ జలకళతో తొణికిసలాడుతోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది జలాశయం పైభాగంలో జోరు వానలు కురుస్తుండడంతో భారీగా నీరు చేరుతోంది. టీబీ డ్యామ్‌కు ప్రధాన జలవనరులైన తుంగ, భద్ర జలాశయాలు పూర్తి స్థాయిలో నిండడంతో రెండు జలాశాయల గేట్లు ఎత్తి లక్షలాది క్యూసెక్కుల నీటి దిగువకు వదులుతున్నారు. గత ఏడాది జలాశయం 19వ క్రస్ట్‌గేటు కొట్టుకొని పోయిన నేపథ్యంలో నిపుణుల నివేకదికల ప్రకారం ఈ ఏడాది జలాశయంలో 80 టీఎంసీ నీటిని మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. బోర్డు అధికారులు జలాశయానికి చేరుకుంటున్న వరద నీటిని క్రస్ట్‌గేట్ల గుండా దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 1624.44 అడుగులకు చేరుకుంది. జలాశయానికి 1.28లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని, జలాశయంలో 74.68టీఎంసీల నీరు నిల్వ ఉందని బోర్డు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1625.13 అడుగులకు నీరు చేరుకోగా, 31.033 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో ఉండగా, 76.91టీఎంసీల నీరు మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం జలాశయానికి అధికంగా వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో దిగువకు ప్రస్తుతం విడుదల చేస్తున్న వరద నీటి ప్రమాణం పెంచే అవకాశం ఉందని బోర్డు అధికారులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.